

వెంకన్న పాదాల చెంత మద్యధార

తిరునగరిలోని భూదేవి కాంప్లెక్స్ ఓల్డ్ చెక్ పాయింట్ పార్కింగ్ స్థలంలో మద్యం ఏరులై పారుతోంది.

- 8లో



వర్షం.. వరి పంటకు నష్టం

ఏర్పేడు మండలంలో గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి వరి పంటకు నష్టం వాటిల్లింది.

- 8లో



రుణాలు మంజూరు చేయండి

డిజిటల్ ఎంపీసీ ద్వారా డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేయాలని జేసీ శుభం బన్సల్ బ్యాంకర్లను ఆదేశించారు.

- 8లో

న్యూస్‌రీల్

అమ్మవారికి వెండి తుంగవళి దీపాలు



అమ్మవారికి వెండి తుంగవళి దీపాలను అందజేస్తున్న రమణారావు దంపతులు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి భక్తులు వెండి తుంగవళి దీపాలను విరాళంగా అందజేశారు. దాతలు బుధవారం వాటిని ఆలయ ఏఈఓ. దేవరాజులకు అందజేశారు. కెనడాకు చెందిన రమణారావు దంపతులు సుమారు రూ.6 లక్షల విలువ చేసే 4.144 కిలోల వెండి తుంగవళి దీపాలను తయారు చేయించారు. వాటిని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాబు స్వామి, ఆలయాధికారులు పాల్గొన్నారు.

ఆధునిక సమాజానికి దిక్సూచి సంస్కృతం



మాట్లాడుతున్న వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: ఆధునిక సమాజానికి సంస్కృతం దిక్సూచి అని అక్షరపురుషోత్తమధామం అధ్యక్షుడు స్వామిభద్రేశ దాస్ పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో సంస్కృత వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఆయన వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తితో కలసి ప్రారంభించి, ప్రసంగించారు. సంస్కృతం భారతీయ జ్ఞాన సంపదకు మూలమన్నారు. సంస్కృతాన్ని ఆధునిక సమాజానికి మరింత చేరువచేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృతంతోనే సమాజంలో ఉత్తమ సంస్కారులుగా గుర్తింపు పొందుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి సమ్మాన గ్రహీత, ప్రొఫెసర్ .కొంపెల్ల రామసూర్యనారాయణ, రిజిస్ట్రార్ వెంకటనారాయణ రావు, డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, డాక్టర్ భారతి భూషణరథ్, డాక్టర్ ప్రదీప్ కుమార్ బాగ్, డాక్టర్ ఉదయాన హెగ్డే పాల్గొన్నారు.

అతకనిపోగు



మగ్గంపై నేత నేస్తున్న చేనేత కార్మికుడు

జిల్లా సమాచారం..

నేత కార్మికులు	15,475
సొంత మగ్గాలు ఉన్న నేతన్నలు	4,250
చేనేత సొసైటీలు	42

జగనన్న ప్రభుత్వంలో నేతన్ననేస్తం లబ్ధి వివరాలు

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	నిధులు(రూ.లక్షల్లో)
2019 –20	3,822	9.17
2020 –21	3,572	8.81
2021–22	3,125	7.50
2022–23	3,171	7.51
2023–24	3,447	8.28

తిరుపతి జిల్లాలో చేనేతల జీవితాలు కడు దయనీయంగా ఉన్నాయి. తాము అధికారంలోకి వస్తే నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతాం.. అన్ని విధాల ఆదుకుంటామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. గద్దెనెక్కి ఏడాదిన్నర అవుతున్నా హామీల అమలులో మీనమేషాలు లెక్కిస్తూ నేటికి తూతూ మంత్రంగా జీఓలు ఇచ్చారు. అవి ఎప్పటికీ పట్టాలెక్కి.. తమ జీవితాలెప్పుడు బాగుపడుతాయోనని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిన్నరగా నేతన్నలపై సర్కారు శీతకన్ను

- మారని చేనేతల జీవితాలు
- ప్రోత్సాహకం లేక అవస్థలు పడుతున్న నేతన్నలు
- గతంలో చేనేతలకు అండగా నేతన్ననేస్తం



అచ్చు అతుకున్న నేత కార్మికురాలు

సైదాపురం/వెంకటగిరిరూరల్: కూటమి సర్కారు నిర్లక్ష్యంతో చేనేత నేత కార్మికుల జీవితాలు కుదేలవుతున్నాయి. ఏడాదిన్నర తరువాత తీరిగ్గా ఈ నెల 7 తేదీన హామీల అమలుకు జీఓ ఇస్తున్నట్లు ప్రకటించారు. అయినా ఆ సాయం ఎప్పటికి అందుతుందో తెలియక నేతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఒక చీర తయారీకి కుటుంబ సభ్యులందరూ రోజంతా కష్టపడాల్సివస్తోంది. చేసిన కష్టానికి తగిన కూలీ గిట్టుబాటు దక్కకపోవడంతో కుటుంబ నిర్వహణ కష్టతరం అవుతుందని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పెరిగిన నిత్యావసర సరుకులు, కూరగాయలు, విద్యుత్ చార్జీలు, ఇంటి అద్దె, పిల్లలు ఫీజులుతోపాటు కుటుంబ నిర్వహణ ఖర్చులకు సరిపడా సంపాదన లేక నేతన్నల జీవనం గడవడం కష్టమవుతోంది.

ఉచిత విద్యుత్ అమలులోనూ కోతలే

మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు దాని అమలులోనూ కోతలు విధిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసినట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకునేందుకు తప్ప నేతన్నలకు పెద్దగా లబ్ధి లేదన్నది తేటతెల్లమవుతోంది. హ్యాండ్‌లూమ్‌కు 200 యూనిట్లు, పవర్ లూమ్‌కు 500 యూనిట్స్ చొప్పున విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలకు ఆ హామీ అమలుకు ఉత్తర్వులిచ్చారు. సర్వేలు, వడపోతల పేరిట కాలయాపన చేసి ఇప్పటివరకు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారు. తాజాగా ఈ నెల 7వ తేదీన అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఉచిత విద్యుత్ అర్హుల జాబితాలో కోతలు పెట్టనున్నారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల తర్వాత ప్రారంభించనున్న ఈ పథకంలో సొంత చేనేత మగ్గాలు కలిగిన 50 వేల మందికి, మర మగ్గాలున్న 15 వేల మందికి మాత్రమే వర్తించేలా కుదించారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రభుత్వం సాయం కోసం ఎదురుచూపులు తప్పడంలేదని పలువురు చేనేతలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నేత కార్మికులకు సరైన ప్రోత్సాహం, ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసపోవడమే కాకుండా అప్పుల ఊబిలో కూరుకుపోయారు.



నూలు వడుకుతున్న మహిళ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతన్నలు ఆధునిక బాట

చేనేత పరిశ్రమ అభివృద్ధికి గత ప్రభుత్వం జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద క్లస్టర్లుగా డెవలప్‌మెంట్ కార్యక్రమం చేపట్టింది. దీంతోపాటు నూలు కొనుగోలు నుంచి తయారైన చీరలను మార్కెటింగ్ చేసే వరకు ప్రభుత్వం అన్ని దశల్లోనూ సహకారం అందించింది. ఫలితంగా చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో లబ్ధిపొందారు. వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా క్లస్టర్లు ఏర్పాటు చేసి వెరైటీ డిజైన్లు ఆధునాతన చీరలు నేసేందుకు అవసరమైన డిజైన్‌లు, 240 హుక్స్ మోటరైజ్డ్ లిఫ్టింగ్ డైవ్స్, ఐరన్ ఫ్రేమ్ లూమ్స్‌లాంటి మిషన్లు, మోటార్లు తదితర పరికరాలను 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేసి, నేనున్నానని భరోసా ఇచ్చింది. అధునాతన వస్త్రాలను నేసేందుకు చేనేత కార్మికులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చింది. ఆప్కో ద్వారా వస్త్రాల కొనుగోలు చేయించింది. చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి రూ.25 వేల సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతన్న నేస్తం

మోడు బారిన మగ్గం బతుకులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ రంగులు అద్దింది. చేనేత పరిశ్రమ అభివృద్ధికి, చేనేత కార్మికుల అభ్యున్నతికి విశేష కృషి చేసింది. చేనేతల జీవితాల్లో వెలుగులు నింపి, ఆధునిక టెక్నాలజీతో నేత పనులు సాఫీగా సాగించుకునేలా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం అమలు చేసి చేనేత పరిశ్రమకు ఊపిరి పోశారు. ఆర్థికంగా చితికిపోయిన చేనేత కుటుంబాలకు అండగా నిలిచారు. గత ప్రభుత్వం ఈ పథకం కింద అర్హత కలిగిన చేనేత కుటుంబానికి రూ.24వేలు ఒకే సారి నేరుగా వారి బ్యాంకు ఖాతాకే జమ చేస్తూ వచ్చింది. గత ప్రభుత్వం ఐదు విడతలు నేతన్న నేస్తం డబ్బులు వారి ఖాతాల్లోకి జమ చేసింది. దీంతో ఒక్కో నేత కార్మికుడు రూ.1.20 లక్షలు లబ్ధిపొందాడు. దీంతో నేతన్నల జీవనం మెరుగుపడింది.

2022–23లో తిరుపతి జిల్లాలో 255 మంది చేనేత కార్మికులకు రూ.1.76 మంజూరు చేయగా, 2023–24లో వందలాది మందికి ఈ పథకం అందజేసింది.

నేతన్ననేస్తం అండగా నిలిచింది.



గత జగన్ ప్రభుత్వం అమలు చేసిన నేతన్ననేస్తం పథకం కార్మికులకు అండగా నిలిచింది. ఎందరో కార్మికులు దుర్భర జీవితాల్లో వెలుగులు నింపింది. దీంతో ప్రభుత్వం ద్వారా వచ్చే నేతన్ననేస్తం నిధులతో మగ్గాల యాంత్రీకరణ చేయించుకుని ఆధుకనిత వైపు అడుగులు వేశారు.

– కూనా మల్లికార్జున్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, చేనేత కార్మికుడు, బంగారుపేట

చేనేతలను ఆదుకోవాలి



గత జగనన్న ప్రభుత్వంలో ఏటా ఇచ్చిన నేతన్న నేస్తం డబ్బులతో మగ్గానికి అవసరమైన డిజైన్ కార్డులు, జాకార్డ్ యంత్రం, మోటారు కొనుగోలు చేశారు. వృత్తిపరంగా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకున్నాం. ప్రస్తుత ప్రభుత్వం కూడా చేనేత కార్మికులను ఆదుకొని ప్రత్యేక నిధులు కేటాయించి, అండగా నిలవాలి.

–వెంకటేశ్వర్లు, వెంకటగిరి

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో 27 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 72,951 మంది స్వామివారిని దర్శించుకోగా 27,143 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.71 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

విద్యాసంస్థలకు మూడు రోజుల సెలవులు

తిరుపతి సిటీ: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేటు విద్యాసంస్థలకు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. శుక్రవారం వరలక్ష్మీ వత్రంతో పాటు రెండో శనివారం, ఆదివారం వరుసగా రావడంతో మూడు రోజులు విద్యాసంస్థలు మూతపడనున్నాయి. సోమవారం విద్యాసంస్థలు యథావిధిగా ప్రారంభం కానున్నాయి.

అపచారాలు ఎత్తిచూపితే నాస్తికులైపోతారా?

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వ్యాఖ్యలపై భూమన ఆగ్రహం



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: టీటీడీలో జరుగుతున్న అనర్థాలు, అపచారాలను ఎత్తి చూపితే నాస్తికులైపోతారా? అని టీటీడీ చైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడిని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రశ్నించారు. తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బొల్లినేని రాజగోపాల్‌నాయుడు టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఈ పదిహేను నెలల కాలంలో టీటీడీలో అన్నీ అపచారాలు, ఘోరాలు తప్ప ఒక మంచి పనైనా చేశారా? అని ప్రశ్నించారు. టీటీడీలో సంపూర్ణ ప్రక్షాళన చేస్తానని చెప్పి శ్రీవాణి ట్రస్టు, తొక్కిసలాట, గోవుల మృతికి సంబంధించి తమపై ఆరోపణలు చేసి, కాలం గడపతమే తప్ప ప్రక్షాళన విషయంలో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఎంతసేపూ వైఎస్సార్‌సీపీపై, తమ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, తనపై నిత్యం విషం చిమ్మే మీ చానళ్లలో నిరంతరం డిబేట్‌లు పెట్టి తాను నాస్తికుడనని, క్రైస్తవుడినని, అవినీతిపరుడనని, టీడీఆర్ బాండ్లులో రూ.వేల కోట్లు దండుకున్నానని విష ప్రచారం చేయడమే తప్ప ఏమైనా చేశారా? అని ప్రశ్నించారు. నాస్తికునికి, క్రైస్తవునికి మధ్య తేడా తెలియని బీఆర్ నాయుడు తిరుమలలో ఏఐ టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగిస్తారో అర్థం కావడంలేదన్నారు. తనపై మీ అభాండాలన్నీ అబద్ధాలు అయినందున మీ భజన నాయుడితో తిట్టించడం తప్ప, మీరు చేసి ఒక మంచి పని చెప్పండి బొల్లినేని రాజగోపాల్‌నాయుడు అని నిలదీశారు. శ్రీవాణి ట్రస్టును రద్దు చేస్తానని ప్రగల్భాలు పలికారు.. శ్రీవాణి లేకపోతే రాష్ట్రంలో, దేశంలో ఆలయాలు కట్టగలరా? అని ప్రశ్నించారు. తాము తీసుకున్న శ్రీవాణి ట్రస్టు ఏర్పాటు నిర్ణయం అత్యద్భుతమైనదని, దానిని మీరు రద్దు చేయలేరన్న విషయం చాలా స్పష్టంగా అర్థమైందన్నారు. ఏఐ టెక్నాలజీతో దర్శనం కల్పిస్తామని చెప్పిన బీఆర్ నాయుడు బోర్డు సమావేశంలో మూడో కాంప్లెక్స్ నిర్మాణం నిర్ణయం ఎందుకని ప్రశ్నించారు. టీటీడీలో మీ మాట చెల్లదని, మీ మాట వినే అధికారులెవరూ లేరన్న విషయం దేశమంతా కోడై కూస్తోందన్నారు.

మీ చేతగానితనానికి నిదర్శనం

మఠాలకు నోటీసులు ఎందుకు ఇచ్చారని, మఠాధిపతులను అవమానించకండని మాట్లాడినందుకు తనపై లేనిపోని ఆరోపణలు చేయడం మీ చేతగానితనానికి నిదర్శనమన్నారు. మఠాధిపతులేమైనా మీ దృష్టిలో తీవ్రవాదుల్లా కనిపిస్తున్నారా? అని మండిపడ్డారు. గతంలో కరుణాకరరెడ్డి అరెస్టయ్యారంటూ తానేదో నేరం చేసినట్లు చెబుతున్నారని, అయితే అతి చిన్నవయసులోనే సమాజం కోసం జైలుకు వెళ్లినందుకు గర్వపడుతున్నానన్నారు. వైకుంఠ టోకెన్ల జారీలో తొక్కిసలాట కారణంగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ బహిరంగంగా ప్రజలకు క్షమాపణ చెప్పమన్నారన్న కక్షతో పవన్‌కళ్యాణ్‌కు సన్నిహితులైన శ్రీనివాసమంగాపురంలోని బాలాజీ దీక్షితులు, అదే సామాజిక వర్గానికి చెందిన చీర్ల కిరణ్‌కు మెమోలు ఇచ్చారే తప్ప వారు మరో తప్పిదాలేమీ చేయలేదన్నారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు వచ్చాకే తిరుమల పవిత్రత మంటగలిసిందని, అనేక అపచారాలతో టీటీడీని భ్రష్టు పట్టించారని ఆరోపించారు.

విద్యా హక్కు.. ఆంక్షల సంకెళ్లు



విద్యతోపాటు విలువలతో కూడిన అత్యుత్తమ సంస్కారం అందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్న విద్యావేత్తల ఆశయాలతో రూపు దిద్దుకుంది మన విద్యావిధానం. అయితే క్షేత్రస్థాయిలో విద్యాహక్కు చట్టాన్ని నీరుగార్చేందుకు కూటమి సర్కారు విద్యార్థి సంఘాలపై ఆంక్షలు విధిస్తోంది. ఇష్టారీతిన వ్యవహరిస్తోంది. దీనిపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

- బ్రిటీష్ పాలనను తలపిస్తున్న కూటమి పాలన
- నిన్న విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాల రాకపై నిషేధం
- నేడు కళాశాలల్లోకి సైతం అనుమతిలేదని జీఓ
- 9న రౌండ్ టేబుల్ సమావేశానికి సిద్ధమైన విద్యార్థి సంఘాలు

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం పాలన బ్రిటీష్ పాలనను తలపిస్తోంది. రాజ్యాంగం కల్పించిన విద్యార్థుల హక్కుకూ సంకెళ్లు వేస్తూ నిరంకుశ పాలనను కొనసాగిస్తోంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై కక్ష్య సాధింపు చర్యలో భాగంగా ఆంక్షలు విధిస్తూ వేధింపులకు దిగుతోంది. గత నెలలో విద్యార్థి సంఘాలు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో వసతుల లేమిని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో ప్రభుత్వం విద్యార్థి సంఘాలపై కక్ష పెంచుకుని పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాలకు అనుమతులు ఇవ్వవద్దంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు కళాశాలలోకి రాకూడదంటూ మరో జీఓ

ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ, అధిక ఫీజులు వసూలు, వసతి గృహాల్లో నాసిరకమైన వసతులు, సమస్యలపై విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. విద్యా ప్రమాణాలు పాటించని ప్రైవేటు జూనియర్ కళాశాలలపై విద్యార్థులు మండిపడ్డారు. దీంతో ప్రభుత్వం మరోసారి జూనియర్ కళాశాలలోకి సైతం విద్యార్థి సంఘాలకు అనుమతి లేదంటూ జీఓ జారీ చేసింది. దీని వెనుక కొన్ని ఏళ్లగా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటూ వారి కడుపుకొట్టి రూ.వేల కోట్ల విద్యా వ్యాపారం చేస్తూ ప్రస్తుతం మంత్రివర్గంలో అమాత్యులుగా కొనసాగుతున్న వ్యక్తి హస్తం ఉన్నట్లు విద్యార్థి సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీన అన్ని విద్యార్థి సంఘాలు ఏకమై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించి భారీ స్థాయిలో ఉద్యమాలకు పిలుపునిచ్చేందుకు సన్నద్ధమవుతున్నాయి.

ఆంక్షలు అందుకేనా?

- యువగళం పాదయాత్ర హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయడం.
- ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో మౌలిక వసతుల కల్పనపై ప్రశ్నించడం.
- సంక్షేమ హాస్టళ్లలో సమస్యలపై నిలదీయడం.
- పాఠశాలల విలీనంతో ప్రాథమిక విద్య నిర్వీర్యమవుతోందని గళం విప్పడం.
- పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్రను అడ్డుకోవడం.
- నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను ముట్టడించడం.
- పాఠశాలల, కళాశాలలో ప్రవేశాలను నీరుగార్చే కుట్రను ఛేదించడం.

ఆగ్రహానికి గురికాక తప్పదు



కూటమి ప్రభుత్వం గత ఏడాదిగా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. విద్యారంగంలోని సమస్యలపై ప్రశ్నించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటి హక్కులను హరించేందుకు కూటమి కుట్ర పన్నుతోంది. విద్యను వ్యాపారం చేస్తున్న కళాశాలపై విద్యార్థి సంఘాలు గళం విప్పితే ఆంక్షలు విధించారు. ఆంక్షలు ఎత్తివేయకపోతే ప్రభుత్వం విద్యార్థి సంఘాల ఆగ్రహానికి గురికాక తప్పదు.

-బండి చలపతి, ఏఐఎస్ఎఫ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి, తిరుపతి

హామీలపై గళం విప్పినందుకా?



లోకేష్ యువగళం పాదయాత్రలో విద్యారంగానికి సంబంధించి ఇచ్చిన హామీలు అమలుకు విద్యార్థి సంఘాలు నిలదీశాయి. ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో మౌలిక సదుపాయాలు, హాస్టల్స్‌లో వసతులపై గళం విప్పాయి. ప్రైవేటు కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ రూ.లక్షల్లో ఫీజులు వసూలుపై విద్యార్థి సంఘాలు ప్రశ్నించాయి. దీంతో ఆంక్షలు పెట్టి విద్యార్థి సంఘాలకు కళ్లెం వేస్తున్నారు.

-ప్రేమ్ కుమార్, ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు

విద్యాహక్కును హరించడమే



విద్యార్థి సంఘాలపై ఆంక్షలు విధించి ప్రభుత్వం తప్పు చేసింది. స్వాతంత్ర్య ఫలాలను ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేయడం రాజ్యాంగ విరుద్ధం. విద్యార్థి సంఘాల అహర్నిశ కృషితోనే ఇప్పటికీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తమ విధులను నిర్వహిస్తున్నాయి. ఆంక్షలు విధిస్తే ఇక పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉంటుంది. ప్రశ్నించే గొంతు లేకపోతే ఆ వ్యవస్థలు నిర్వీర్యమైనట్టే.

- చంద్రశేఖర్‌రావు, రిటైర్డ్ అధ్యాపకులు, తిరుపతి

వ్యవస్థలను చేతులోకి తీసుకుంటే ఊరుకోం



కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వ్యవస్థలను తమ చెప్పు చేతుల్లోకి తీసుకుని ఇష్టాను సారంగా వ్యహిరిస్తే ఊరుకోం. రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కులపై ఉక్కుపాదం మోపే ప్రయత్నం ఆపకపోతే ఉద్యమం తప్పదు. తక్షణం విద్యార్థి సంఘాలపై ఆంక్షలను ఎత్తివేయాలి. లేదంటే ప్రభుత్వం మెడలు వంచుతాం.

- అక్బర్, ఎస్ఎఫ్ఐ, జిల్లా అధ్యక్షులు, తిరుపతి

ప్రభుత్వం గీత దాటుతోంది



కూటమి ప్రభుత్వం తమ పరిధి దాటి ఆంక్షల పేరుతో కక్ష్య సాధింపు చర్యలకు దిగుతోంది. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకే విద్యార్థి సంఘాలు ప్రయత్నిస్తాయి. అలాంటి ఆంక్షల పేరుతో విద్యాసంస్థలలోకి అనుమతులు లేకుండా జీఓలు జారీ చేయడం దుర్మార్గం. ఇలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తేలేదు. ఉద్యమ కార్యచరణతో పోరాటాలు చేసి తీరుతాం.

-లోకేష్, పీడీఎస్‌యూ, జిల్లా కార్యదర్శి తిరుపతి

ఇష్టారాజ్యంతో చెలరేగిపోతాయి



ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు తల్లిదండ్రుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నాయి. ఇక నుంచి రూ.కోట్లు వసూలు చేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలపై స్పందించే వారు లేకపోతే అధికారులు, ప్రభుత్వాలు రెచ్చిపోయి తాము ఆడిందే ఆటగా వ్యవహరిస్తాయి. తస్మాత్ జాగ్రత్త.

-సుబ్బలక్ష్మి, రిటైర్డ్ టీచర్, తిరుపతి



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,03,290
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.9,337
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,16,400
రిటైల్ వెండి గ్రాము	రూ.119.40

క్లుప్తంగా

వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ఏఓ హరిత

పాకాల: రైతులు రబీలో చేపట్టనున్న వరి సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి కేవీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని మొగరాల రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా అందించే పీఎండీఎస్ కిట్లతో పాటు రైతులకు ఇస్తున్నా పలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలి పారు. అనంతరం ఏఓ హరిత మాట్లాడుతూ వరిలో సహజ ఎరువులు, కషాయాల వాడడంతో అధిక దిగుబడితో పాటు నాణ్యమైన ఉత్ప త్తిని సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సి.మహేష్, సర్పంచ్ మధునాయుడు, మాజీ సర్పంచ్ ఆనందచౌదరి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి

శ్రీకాళహస్తి: విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తిలో బుధవారం చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. పిచ్చాటూరు మండలం కీళ్లపూడి గ్రామానికి చెందిన చిరంజీవి(35) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. ఈ నేపథ్యంలో రేణిగుంట నుంచి శ్రీసిటీకి కంటైనర్‌ను తరలిస్తుండగా పట్టణంలోని భక్తకన్నప్ప సర్కిల్ వద్ద విద్యుత్ తీగలు కంటైనర్‌కు తగలడంతో విద్యుతషాక్‌కు గురైన చిరంజీవి అక్కడికక్కడే మృతి చెందాడు. రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై విచారణ చేపట్టారు.

లారీ బోల్తా



రేణిగుంట: మండలంలోని మర్రిగుంట ప్రధాన కూడలిలో బుధవారం తెల్లవారుజామున క్యాబేజీ లోడ్‌తో వెళుతున్న లారీ బోల్తా పడింది. బెంగళూరు నుంచి కోల్‌కతాకు లారీ క్యాబేజీ లోడ్‌తో వెళుతున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో వెనుక నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఉదయం క్యాబేజీని మరో లారీలోకి మార్చి క్రైయిన్‌తో బోల్తా పడిన లారీని పక్కకు తప్పించి, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

వెంకన్న పాదాల చెంత మద్యధార



మద్యం బాటిళ్లను చూస్తున్న భక్తులు

ప్రతి క్షణం ధ్వనించే గోవింద నామస్మరణ.. వెల్లివిరిసే భక్తిభావం.. ఆ ప్రాంతం ఆధ్మాత్మిక నిలయం..అద్యంతం వేంకటేశ్వరుడిపైనే అందరి ధ్యాస.. ఆ ఏరియా మొత్తం మద్యం, మాంసం నిషేధిత ప్రాంతం.. అయినా అక్కడా అల్లరి మూకలు.. అసాంఘిక శక్తులు చెలరేగుతున్నాయి. తమ మద్యపానానికి అడ్డాగా మార్చుకున్నాయి. ఫలితంగా యథేచ్ఛగా మద్యం ఏరులై పారుతోంది. ఇదెక్కడో కాదు..నిత్యం గోవింద నామస్మరణలతో మారుమోగే ఆధ్యాత్మిక నగరం తిరుపతిలోని అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్స్ టీటీడీ ఓల్డ్ చెక్ పాయింట్ పార్కింగ్ స్థలం. ఇక్కడికి బయట ప్రాంతాల నుంచి భక్తులు వివిధ వాహనాల్లో వచ్చి అలిపిరి కాలినడకన తిరుమలకు నడిచి వెళ్లే క్రమంలో తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు టీటీడీ పార్కింగ్ ఏర్పాటు చేసింది. అయితే ఈ పార్కింగ్ ప్రాంతంలో ఎటు చూసినా మద్యం బాటిళ్లే దర్శనమిస్తున్నాయి. కూనవేటు దూరంలోనే టీటీడీ భద్రతా కార్యాలయంతోపాటు సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇక్కడ పరిస్థితి చూస్తే వాటి పనితీరుపై అనుమానాలు వస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



మద్యం బాటిళ్లను శుభ్రం చేస్తున్న స్వీపర్



కారు పార్కింగ్‌లోని ఓ పాత జీపులో మద్యం బాటిళ్లు



మద్యం సీసాలను ఎత్తి బుట్టలో వేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు



బహిరంగ ప్రదేశంలో ఖాళీ మద్య సీసాలు



బహిరంగ ప్రదేశంలో పడవేసిన బాటిళ్లు

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటులో ఆలస్యమెందుకు?

- పార్లమెంటులో ఎంపీ మద్దిల గురుమూర్తి



ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : నగరంలో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపినప్పటికీ, దాని ఏర్పాటు ఎందుకు ఆలస్యమవుతోందని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నించారు. బుధవారం పార్లమెంటులో ఆయన మాట్లాడుతూ ఏడాది కిందట తిరుపతిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటును ప్రకటించినా సిబ్బంది నియామకం ఆలస్యంతో పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. నిర్వాహక లోపాల కారణంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య సేవలు అందకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో నియామకాలు జరిగేలోగా తాత్కాలిక ఒప్పంద సిబ్బంది ద్వారా తిరుపతి సీజీహెచ్‌ఎస్ కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలని ఆయన కేంద్రాన్ని కోరారు. అలాగే తిరుపతి జిల్లా శ్రీసిటీ, నెల్లూరులో ప్రతిపాదిత 100 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రులు కూడా ఇప్పటివరకు భూమిపూజ స్థాయికి కూడా రాలేదని చెప్పారు. కేంద్రం నుంచి మంజూరు అయినప్పటికీ నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభం కాలేదని విమర్శించారు. తిరుపతి జిల్లాలో సత్యవేడు, తిరుమల, నాయుడుపేట, వరదయ్యపాళెం, నెల్లూరు జిల్లా ముత్తుకూరులో ఈఎస్‌ఐ డిస్పెన్సరీలు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదని, వాటి ప్రారంభం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి కార్మికులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరిరక్షణ అందించే ఈ సౌకర్యాలు ఆలస్యం కావడం బాధాకరమన్నారు.

ఎంపీ చొరవతో ఇరకం, రాయదొరువుకు సాంకేతిక సేవలు

తడ: ఎంపీ మద్దిల గురుమూర్తి చొరవతో సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లోని ఇరకం దీవి, పూడి రాయదొరువు గ్రామాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సెల్ టవర్ల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలిగాయి. తీర ప్రాంత గ్రామాలైన ఈ రెండు చోట్ల సెల్‌ఫోన్లకు సిగ్నల్ లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పింఛన్లు, రేషన్ సరుకుల పంపిణీ, ఇతరత్రా ప్రభుత్వ ఆన్‌లైన్ సేవలు పని చేయకపోవడంతో ఇక్కడ ఆఫ్‌లైన్ ద్వారానే సేవలు కొనసాగుతూ వస్తున్నాయి. అలాగే ప్రకృతి విపత్తుల సమయంలో ఏవైనా హెచ్చరికలు, ప్రభుత్వ అధికారుల ద్వారా ముఖ్యమైన సమాచారం ఇవ్వాల్సి వచ్చినా ఫోన్, నెట్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికుల నుంచి ఈ సమస్యలు తెలుసుకున్న ఎంపీ గురుమూర్తి దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. దేశ వ్యాప్తంగా 4జీ టవర్ల ఏర్పాటు ప్రాజెక్టులో భాగంగా ఇరకం దీవి, పూడి రాయదొరువు గ్రామాలను ఎంపిక చేయాలని కోరారు. గతంలో దీనికి బీఎస్‌ఎన్‌ఎల్ అంగీకారం తెలిపినా ఈ రెండు ప్రాంతాలు ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఉన్నందున అటవీ శాఖ, పర్యావరణ అనుమతులు అవసరం కావడంతో టవర్ల ఏర్పాటుకు అడ్డంకి ఏర్పడింది. దీనిపై తిరుపతి ఎంపీ కార్యాలయంలో ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో అటవీ శాఖ అనుమతులతోపాటు పూడిరాయదొరువు టవర్‌కి అవసరమైన విద్యుత్ కనెక్షన్ ఏర్పాటులో ఉన్న సమస్యలను అధికారులు ఎంపీకి వివరించారు. ఆ మేరకు అటవీ శాఖ అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర సింగ్‌కి లేఖ రాశారు. దీనిపై శాఖా పరమైన అనుమతులు మంజూరు చేస్తూ అటవీశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపీ తెలిపారు. టవర్ల నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో త్వరలోనే ఈ గ్రామాలకు నాణ్యమైన మొబైల్ నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెవిరెడ్డిని కాపాడు తల్లీ..!



అమ్మవారి ఆలయం ముందు కొబ్బరికాయలు కొడుతున్న పార్టీ నేతలు

- చెవిరెడ్డిపై తప్పుడు కేసు
- అక్రమ నిర్బంధానికి 50 రోజులు
- బెయిల్ రావాలని కోరుతూ కొబ్బరి కాయలు కొట్టిన నేతలు

తిరుపతి రూరల్: 'అమ్మా.. చాముండేశ్వరీ..కుటమి సర్కారు కుట్రల నుంచి చెవిరెడ్డిని కాపాడు తల్లీ.. నీ బిడ్డ చెవిరెడ్డిని తప్పుడు కేసులో నిర్బంధించి జైలులో పెట్టారు.. ఆయన ఆరోగ్యం కాపాడి త్వరగా బయటకు వచ్చేలా అనుగ్రహించు తల్లీ..' అంటూ వైఎస్సార్ సీపీ చంద్రగిరి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని ప్రార్థించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట సమీపంలోని శ్రీశక్తి చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం చెవిరెడ్డి పేరిట అర్చన చేయించి, అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయం ఎదుట అమ్మవారికి 216 కొబ్బరికాయలు కొట్టి తమ నాయకుడు చెవిరెడ్డి త్వరగా బయటకు రావాలని ప్రార్థించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేతలు మీడియాతో మాట్లాడుతూ తప్పుడు కేసులో చెవిరెడ్డిని నిర్బంధించి 50 రోజులు గడిచిపోయాయని, ఆయన ఆరోగ్యం బాగుండాలని, త్వరగా బెయిల్‌పై విడుదల కావాలని అమ్మవారిని ప్రార్థించామన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు, దౌర్జన్యాలు, దాడుల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. చెవిరెడ్డిని విడుదల చేసేంత వరకు తాము పోరాడుతూనే ఉంటామని, ఈ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఎండగడతామని హెచ్చరించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ వెళ్లి చెవిరెడ్డిపై పెట్టిన అక్రమ కేసును వివరించి కూటమి పెద్దల కుట్రలు బయటపెడతామన్నారు.

కాపాడినందుకు.. కటకటాలకు పంపించారా.?

'కరోనా సమయంలో రక్త సంబంధీకులు సైతం దూరంగా వెళ్లి తలుపులు మూసుకుంటే.. ప్రతి ఇంటి తలుపు తట్టి ఒక ఆత్మబంధువులా అందరినీ కాపాడిన వ్యక్తి చెవిరెడ్డి. టీడీపీ వారిని సైతం కాపాడినందుకు ఆయన్ని కటకటాలకు పంపించారా..? పార్టీలు చూడకుండా ఎంతో మంది టీడీపీ నేతలకు సాయం చేసినందుకు జైలుకు పంపారా..? కూటమి పెద్దలు సమాధానం చెప్పాలి.' అని వైఎస్సార్‌సీపీ తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు కొత్తపాటి మునీశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, రాష్ట్ర పార్టీ నాయకులు, జిల్లా పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, జగనన్న అభిమానులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆస్తులు ప్రైవేటీకరణ సరికాదు



మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ జిల్లా కార్యదర్శి బాబు

తిరుపతి అర్బన్: ఎంతో విలువైన ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటీకరణ చేయడం సరికాదని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు పేర్కొన్నారు. డీపీటీఓ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవాడలోని గవర్నర్‌పేట–2 డిపోకు చెందిన 4.15 ఎకరాల భూమిని లులూ అనే ప్రైవేటు సంస్థకు కట్టబెట్టడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఉన్నతాధికారులు ఏక పక్షంగా ఇలా జీఓలు ఇవ్వడం మానుకోవాలని చెప్పారు. గవర్నర్‌పేట–2 డిపో స్థలం విలువ రూ.400 కోట్లు ఉంటుందన్నారు. ఇలా ఒక్కొక్కటిగా ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లోనూ ఈ నెల 12, 13 తేదీల్లో ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో ధర్నాలు చేయనున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అభినయ్



తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ రెడ్డి పార్టీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఆమేరకు ఆయన ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు పార్టీ యువజన భాగం వర్కింగ్ ప్రెసిడెంట్గా బాధ్యతలు నిర్వహించనున్నారు.

సీకాం డిగ్రీ కళాశాలకు 'అటానమస్'




కళాశాల భవనం

తిరుపతి సిటీ : అన్నమయ్య సర్కిల్‌లోని సీకాం డిగ్రీ కళాశాల మరో మైలురాయిని దాటింది. కళాశాలకు అటానమస్ హోదా లభించిందని విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ టి.సురేంద్రనాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఇటీవలే నాక్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించామని, అటానమస్ కోసం దరఖాస్తు చేసుకోగా యూజీసీ మా కళాశాలలో విద్యా నాణ్యతా ప్రమాణాలను, మౌలిక వసతులను పరిశీలించి హోదా కల్పించిందన్నారు. తిరుపతిలో అటానమస్ హోదా పొందిన తొలి డిగ్రీ కళాశాలగా గుర్తింపు పొందడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందికి అధ్యక్షులు జయలక్ష్మి, డైరెక్టర్ ప్రణీత్ స్వరూప్, తేజ స్వరూప్ అభినందనలు తెలిపారు.

నా కొడుకు కర్కశంగా ప్రవర్తిస్తున్నాడు!

నాయుడుపేటటౌన్: కన్న తల్లి అన్న దయ, దాక్షిణ్యం చూపకుండా కొడుకు, కోడలు తనపై కర్కశంగా దాడి చేసి, ఇంటి నుంచి గెంటేయాలని చూస్తున్నారని తల్లి కలపాటి మేరమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం మేరకు.. పట్టణంలోని లోతువానిగుంట కాలనీలో ఉన్న మేరమ్మ ఇంటి వద్ద బుధవారం ఆమె కుమారుడు కలపాటి శ్రావణ్‌కుమార్, కోడలు లలిత కలిసి దాడి చేసినట్లు ఆవేదన చెందుతోంది. కుమారుడు, కోడలు తనను ఇంటి నుంచి గెంటి వేయాలని ఇద్దరు కలిసి దాడి చేయడంతో మేరమ్మ తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆమెను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి, చికిత్స అందిస్తున్నారు. తన కష్టార్జితంతో కట్టుకున్న ఇంటిని ఇచ్చి వెళ్లి పోవాలంటూ కొడుకు, కోడలు కలిసి తరచు చిత్రహింసలు పెడుతున్నట్లు మేరమ్మ విలేకరుల ఎదుట వాపోయింది. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

అగ్గిపెట్టె పరిమాణంలో అవార్డుల శకటం



అవార్డుల శకటం సృజన చిత్రం

గూడూరు రూరల్ : మండలంలోని విందూరు జెడ్పీ హైస్కూలు తెలుగు ఉపాధ్యాయుడు, సృజన చిత్రకారుడు కొండూరు వెంకటేశ్వరరాజు బుధవారం అగ్గిపెట్టె పరిమాణంలో అవార్డుల శకటాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన విద్య, సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థల నుంచి 200 అవార్డులు అందుకున్నానని, ఈ సందర్భంగా విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు సృజనాత్మకంగా ఈ శకటాన్ని నమూనాగా తీర్చిదిద్దినట్లు తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు



గంజాయి విక్రయిస్తున్న భరత్, రాజేంద్రన్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

చంద్రగిరి: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని తిరుచానూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు చెన్నైకు సమీపంలోని పెరియమేడుకు చెందిన భరత్, తిరువళ్లూరు జిల్లా పెరియపక్కం ప్రాంతానికి చెందిన రాజేంద్రన్ కొద్ది రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా దామినేడు సమీపంలోని ఇందిరమ్మ గృహాల వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు వారిపై ప్రత్యేక నిఘా పెట్టి, మంగళవారం అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. ఈక్రమంలో రాజేంద్ర అనే వ్యక్తి తన వద్ద ఉన్న కత్తితో గొంతుకోసుకోవడానికి యత్నించడంతో పోలీసులు అడ్డుపడి, అదుపులోకి తీసుకున్నారు. ఆపై వారి వద్ద నుంచి రెండు గంజాయి పొట్లాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు తరలించి, తమదైన శైలిలో విచారించారు. ఈ క్రమంలో గత కొద్ది రోజులుగా ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రుణాలు మంజూరు చేయండి

తిరుపతి అర్బన్: వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎంసీపీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విద్యాహబ్ తిరుపతి జిల్లాలో పలు విశ్వవిద్యాలయాలున్నాయని, విద్యకు సంబంధించిన రుణాల విషయంలో ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. పీఎంఈజీపీ పథకం ద్వారా రుణాలు మంజూరైన యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు పంట రుణాల మంజూరు చేసే సమయంలో పంటలకు బీమా చేయించాల్సిన బాధ్యత బ్యాంకు వారిదేనని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, వ్యవసాయ శాఖ పీడీ ప్రసాదరావు, మార్కెటింగ్ అధికారి సురేంద్ర బాబు పాల్గొన్నారు.

వేడుకగా ఛత్రస్థాపనోత్సవం



శ్రీవారి పాదాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల: తిరుమలలోని నారాయణగిరి శ్రీవారి పాదాల చెంత బుధవారం ఛత్రస్థాపనోత్సవం వేడుకగా నిర్వహించారు. శ్రీవారి పాదాల వద్ద టీటీడీ అర్చక బృందం ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్ఠించారు. ముందుగా తిరుమల శ్రీవారి ఆలయంలో రెండో గంట తర్వాత పూజ సామగ్రి, పుష్పాలు, నైవేద్యం, గొడుగుతో మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడ వీధుల గుండా మేదరమిట్టకు చేరుకున్నారు. అక్కడి నుంచి నారాయణగిరికి విచ్చేశారు. ముందుగా శ్రీవారి పాదాలకు తిరుమంజనం నిర్వహించారు. అలంకారం, పూజ చేసి నైవేద్యం సమర్పించారు. వేదపారాయణదారులు ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. ఆ తరువాత భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. తిరుమల ఏడుకొండల్లో అత్యంత ఎత్తయిన నారాయణగిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామివారు మొదటగా కాలు మోపిన సందర్భాన్ని పురస్కరించుకుని ద్వాదశినాడు ఛత్రస్థాపనోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి మరో గాథ కూడా ఉంది. సాధారణంగా ఈ కాలంలో గాలులు ఎక్కువగా వీస్తాయి. నారాయణగిరి శిఖరం ఎక్కువ ఎత్తులో ఉండడంతో మరింత ఎక్కువగా గాలులు వీస్తాయి. ఈ గాలుల నుంచి ఉపశమనం కల్పించాలని వాయుదేవుని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్ఠిస్తారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

గూడూరులో డ్రగ్స్ కలకలం

సాక్షి టాస్క్‌ఫోర్స్: గూడూరులో బుధవారం రాత్రి డ్రగ్స్ పట్టుబడినట్లు తెలియడంతో పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు. పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో ఉన్న చిన్నపాటి సందులో బుధవారం ఓ వ్యక్తి వద్ద డ్రగ్స్ ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు రహస్యంగా దాడులు చేసి అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. పట్టుబడిన వ్యక్తి బంధువులు, స్నేహితులు వెంటనే ఆ విషయాన్ని అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి వద్ద తీసుకెళ్లినట్లు సమాచారం. ఆయన ఈ విషయం బయటపడకుండా చూడాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. అయితే పట్టుబడిన వ్యక్తి వద్ద ఉన్నది డ్రగ్సా, గంజాయా అనేది తెలియరాలేదు.

వర్షం.. వరిపంటకు నష్టం

ఏర్పేడు: రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి మండలంలోని చిందేపల్లిలో వరి పంట దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన జంగం వెంకటరమణమ్మ ఆరు ఎకరాల్లో వరి పంటను సాగు చేసింది. పంట చేతికొచ్చే సమయానికి వర్షం కురవడంతో పంట నేలకొరిగి, ధాన్యపు గింజలు వర్షపు నీటిలో మగ్గిపోయాయి. అలాగే గ్రామంలోని మరికొంత మంది రైతుల పంట నేలకొరిగింది. మండలంలోని దుర్గిపేరి, చింతలపాళెం గ్రామాల్లో వేరుశనగ నూర్పిడి జరుగుతుండడంతో వేరుశనగకాయలు వర్షంలో తడిసి రంగుమారి మొలకలొచ్చాయి. అయినా ఎలాంటి పంట నష్టం జరగలేదని ఏఓ సాగరిక తెలిపారు.

నూతన బ్యాగుల పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..



నూతన బ్యాగులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం



నూతన బ్యాగులు తీసుకున్న విద్యార్థులు

- చిరిగిన బ్యాగులపై స్పందించిన విద్యాశాఖ

వరదయ్యపాళెం: విద్యార్థులకు కూటమి ప్రభుత్వం పంపిణీ చేసిన స్కూల్ బ్యాగులు చిరిగిపోవడంతో విద్యార్థులు పడుతున్న కష్టాల గురించి ఈ నెల 6వ తేదీన మిత్ర భేదం అన్న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి స్పందిస్తూ సంబంధిత పాండూరు పాఠశాలలో చిరిగిన బ్యాగులకు బదులుగా విద్యార్థులకు నూతన బ్యాగులను పంపిణీ చేయాలని పాండూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడికి ఆదేశాలు జారీ చేశారు. దీనిపై స్పందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునిసుబ్రమణ్యం బుధవారం బ్యాగులు చిరిగిన విద్యార్థులను గుర్తించి మరోసారి నూతన బ్యాగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. సాక్షి చొరవపై విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

అంతర్‌జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు వర్సిటీ విద్యార్థినులు



ఎం.మాలతి బి.చంద్రిక వై.తేజస్విని పి.యామిని

తిరుపతి రూరల్: ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈనెల 29 నుండి 31వ తేదీ వరకు జరగనున్న సీనియర్ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ విద్యార్థినులు ఎంపికయ్యారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళలు, పురుషుల జట్లు ఎంపికల్లో మహిళావర్సిటీకి చెందిన పి యామిని (డీఈడీ), వై తేజస్విని (ఎల్‌ఎల్‌బీ), ఎం మాలతి (బి ఫార్మసీ), బి. చంద్రిక (బీఫార్మసీ) విద్యార్థిను ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య విభాగాధిపతి ప్రొఫెసర్. జి.సారా సరోజినీ, యూనివర్సిటీ వీసీ ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ఎన్. రజినీ గురువారం విద్యార్థినులను అభినందించారు.